
# వ్యాధి

డాక్టర్. జి.వి.కృష్ణయ్య



"మా నాయిన పరిస్థితి అప్పట్నించి కూడా తేరుకోలేదనా... ఆస్పత్రిలన్నీ తిరిగి తిరిగి శానా డబ్బులు పోశాం. మంత్రాలని, తంత్రాలని... దేవర్లనీ...దెయ్యాలనీ నువ్ చెప్పిందల్లా చేస్తానే వుండాం. ప్చ... ఏం లాభం లేదు... గుండమాల నుంచి వచ్చిన కొక్కిల గడ్డ కోటేశ్వరరావు పెద్ద కొడుకు కొత్తపట్నం హాస్పిటల్ దగ్గర కలిసినప్పుడు వాళ్ల నాన్న ప్రస్తావన తెచ్చాడు.

"ఏమయ్యింది? ఎలా వున్నాడు?"

"మా ఊరోడే చాతబడి చేయించినాడంట"

"చాతబడి, బాణామతి ఎక్కడున్నాయయ్యా! ఎందుకలాంటి చాదస్తాలు పెట్టుకొని జీవితాలు నాశనం చేసుకుంటారు."

"లేదు...లేదనా! దాని మీద పెద్ద యవ్వారం జరిగి పోలీసుకేసుదాక్కూడా పోయినాయి... వాయిదాలకు తిరగతాండాం...చేసినోడే ఒప్పుకున్నాడనా"

"మీరంతా ఒక్కసారే దాడికొచ్చేసరికి భయపడి ఒప్పుకొనుండొచ్చుగదా!"

"పస్తీ కెళ్లినా ఆడి పేరే వచ్చింది"

"పస్తీలో (ప్రశ్న) ఫలానా మనిషని పేరు చెప్పారా? లేదు కదా! ఆ మనిషి మీద అనుమానం పెట్టుకుని పస్తీ అడిగారు. వాడు పది విషయాలుచెబితే మీరు అనుమానించిన వ్యక్తిలో నాలుగైదు లక్షణాలుకనిపించాయి. దాంతో అతనే చేసుంటాడని అంతా కలిసి గొడవకు పోయారు అంతేనా?

డాక్టరుగారు అడుగుతున్న ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేక 'మా పెద్దోళ్లంతా ఆడే చేసుంటారంటున్నారనా ఎట్టవుద్దో ఏమో! అంటూ బయటకి వెళ్లిపోయాడు.

రెండు

మాసాల క్రితం ఒక అర్ధరాత్రి సమయంలో నలుగురు మనుషులు కోటేశ్వర్రావును జీపులో కొత్తపట్నం హాస్పిటలుకు తీసుకొచ్చినప్పుడు చాలా ఆందోళనకరంగాకనిపించాడు.

''మంటలు...మంటలు...అమ్మో నే బతకను అయ్యో'' కేకలేస్తూ మంచం మీద అటూ ఇటూ పొర్లాడుతున్నాడు.

శరీరమంతా పసుపు పూసి వుంది. మెడలో తాయత్తులు, మంత్రించిన దారాలూ, మెడపై వ్రేలాడుతున్న గుడ్డ పీలిక (దురాయి) నుదిటిపై విభూది రేకల మధ్యన కొలువు తీరిన కుంకుమ బొట్టు, పెరిగిన గడ్డం, మాసిన తలజుట్టుతో క్షుద్ర దేవత బలికి సిద్ధం చేసిన జంతువులా అరుస్తూ ఊగిపోతున్నాడు. వాడిన ఆటలమ్మ మచ్చలతో స్నాన సంస్కారం లేక వళ్లంతా ఒక విధమైన వాసనవేస్తోంది.

''ఏమయ్యింది'' రోగిని తీసుకొచ్చినవారినడిగాడు డాక్టరు.

''తల్లి పోసి రెండు వారాలయిందయా. ఒళ్లంతా పచ్చిరెడమయిపోయింది. నోరూ అంగిలి పూసిపోయి...గుటక మింగాలంటే అల్లాడిపోతుండాడు. మొన్నయితే కళ్లు మరీ చింత నిప్పుల్లా వుండేయి. నాలుగు దినాల నుంచి మరీ కోడికీ మాకు తెల్లార్తుంది. కూకోలేకపోతున్నాడు. పడుకోలేకపోతున్నాడు. ఇదే జాతర. సూదో...బిల్లో యేద్దామంటే చుట్టుపక్కలోళ్లు తల్లిపోస్తే ఎట్టెస్తారు అని ఎయినీక పోతుండ్రి. ఆయన బాధ చూడలేక ఎట్టయితే అట్ట వుద్దని ఆస్పత్రికి తీసుకొచ్చాం. ముద్దనోట్లోకి పోతే చాలు ఒకటే...వాంతి...కడుపులోకి ఏమీ సారక్క నీరసమయిపోతుండు. చూడ్లేక పోతుండాం. ముందా బాధ తగ్గే మార్గం చూడయ్యా'' వివరాలు చెబుతూనే ఇవతలకొచ్చి మొల మీద పంచె సర్ది కాళ్ల దగ్గర దిగాలుగా నిలబడింది. కోటేశ్వర్రావు భార్య తిరుపతమ్మ.

మంటలు, నెప్పులు తగ్గడానికి ఇంజక్షన్ ఇచ్చి సెలైన్ పెట్టాడు. మందులు తెచ్చాక యాంటి బయోటిక్స్, సెడేషన్ ఇవ్వగానే సద్దుమనిగి నిద్రలోకి జారుకున్నాడు. డాక్టరు గారు కాంపౌండర్‌ను పిలిచి ఆ రాత్రికి అవసరమైన మందులు సలహాలు చెప్పి మిగతా విషయాలు ఉదయం మాట్లాడుకుందామని వెళ్లిపోయాడు.

ఉదయాన్నే డాక్టరు వాకింగ్‌కు వెళ్లొచ్చి చూస్తే పేషెంటుతో పాటు అందరూ నిద్రపోతున్నారు. తిరుపతమ్మ మాత్రం మంచం పక్కనే బెంచిమీద కూర్చుని కునికిపాట్లు పడుతూనే సెలైన్ కట్టిని చేయిని వదలకుండా పట్టుకునుంది. చప్పుడికి లేవబోతున్న ఆమెను కూర్చోమని చెప్పి ''పేషెంటును నిద్రపోనివ్వండి మరలా రౌండ్స్‌కి వచ్చినప్పుడు చూస్తాను'' చెప్పి డాక్టరు ఇంట్లోకి వెళ్లిపోయాడు.

''ఎలా వుంది కోటేశ్వర్రావు?'' డాక్టరు రౌండ్స్‌లో పలకరించాడు.

''పరవాలేదయ్యా! సుమారుగుంది గానా! నే పుట్టి బుద్దెరిగినాక ఇసుమంటి బాధ నేనెరగనయ్యా. దీనెమ్మ నాయాల్డి... శరీరమంతా చీమలు పాకినట్లు ఒకటే... ఎరలు... ఎండకీ జలమ సద్దామనిపించిదంటే నమ్మండి. వంటిపై నీళ్లోసుకొని రెండు వారాలయ్యింది.... ఒకటే కసురుగుంది. అసలింత బాధ ఎందుకొచ్చింది డాటరుగోరూ...'' రెండు చేతులూ జోడించి లేచి గోడకానుకుని నిలబడ్డాడు.

''రోగం వచ్చినప్పుడు వైద్యం చేయించుకోవాలి కానీ మంత్రాలూ, తంత్రాలకు తగ్గుతాయంటయ్యా. ఆటలమ్మ కూడా ఒక జబ్బేగదా! అదెందుకొస్తుందో తెలియని రోజుల్లో మూఢనమ్మకాల్ని ఆశ్రయించారు. అది వైరస్ వ్యాధిని తెలుసుకున్నాక తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైరస్‌కు తగిన మందులు వేసుకునుంటే ఇంతవరకూ వచ్చేది కాదు గదా ! సరే... ఇప్పుడయినా భయపడాల్సిన పనిలేదు. మందులు వాడితే నాలుగు రోజుల్లో సర్దుకుంటాయిలే వుండండి'' మందు రాసిచ్చాడు డాక్టరు గారు.

''మీకు తెలియందేముంది సారూ ! మా వోళ్లయన్నీ మొరటు పనులు ఇంకా ఎనకటివ్వారాలు పోలా... అప్పటికీ నే చెబుతానే వుండ... ఒరే ! దేనికదే వుండాలని... పుసిక్కిమంటే ఆస్పత్రికి పరిగెత్తావుంటే... ఇప్పుడెవులు చేస్తుండారియన్నీను... ఎందో మా వోళ్ల చాదస్తంగానీ'' కాస్త ఇస్త్రీ బట్టలేసుకొని టౌనులో రాజకీయనాయకుల చుట్టూ తిరిగే లోకల్ నాయకులు బలరామయ్య మాట్లాడుతుంటే మిగతా వాళ్లు వినీ విననట్లు తప్పుకుంటున్నారు.

''రోగం వచ్చినప్పుడు వైద్యం చేయించుకోవాలి కానీ మంత్రాలూ, తంత్రాలకు తగ్గుతాయంటయ్యా. ఆటలమ్మ కూడా ఒక జబ్బేగదా! అదెందుకొస్తుందో తెలియని రోజుల్లో మూఢనమ్మకాల్ని ఆశ్రయించారు. అది వైరస్ వ్యాధిని తెలుసుకున్నాక తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైరస్‌కు తగిన మందులు వేసుకునుంటే ఇంతవరకూ వచ్చేది కాదు గదా ! ''

శుభ్రంగా గోరు వెచ్చని నీటితో స్నానం చేయించి భోజనం పెట్టమని డాక్టరు చెబితే అక్కడి వాళ్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు అయోమయంగా...

డాక్టరుగారికి అర్థం కాక వారిని చూస్తూ నిలబడ్డాడు.

''అది కాదయ్యా ! ఇంకా దింపులు కాలేదు గదా తానం...'' నసుగుతూ తన అనుమానమే మిగతా వారి అభిప్రాయంగా వెలిబుచ్చాడు ఒక పెద్దాయన.

''దింపుల సంగతి దేవుడెరుగు ! స్నానం లేక వళ్లంతా వాసనవస్తోంది. శుభ్రంగా లేకుంటే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఏం కాదు గానీ నే చెప్పినట్లు చేయండి''

''డాటేరుగోరున్నారు గదా భయమెందుకు. అయ్యగారు చెబినట్టే చేద్దాం'' అన్నారే గాని డాక్టరు గారు వెళ్లిన తర్వాత ఆ పనిచేయకుండా గుడ్డతో వళ్లు తుడిచి ఓ.కె. అనిపించారు. మరో రెండు రోజులు హాస్పిటల్‌లోనే వున్నా స్నానం మాత్రం చేయలేదు.

మందులు ఇస్తే ఇంటికిపోయి వాడుకుని మళ్లా వస్తామన్నారు. డాక్టరు గారు ఇంకో రెండ్రోజులుండి చూసుకొని పొమ్మన్నా ''కాదు'' ఇంటి దగ్గర కాస్త అర్జెంటు పనుంది వెళ్లాలని పట్టుబట్టారు.

ఆరోజు ఆదివారం ఎవరో భూత వైద్యుడు రోగికి 'పై చేష్టలున్నాయి' ఇంటికి తీసుకొస్తే బాగు చేస్తానన్నాడట. దానికి చానా తతంగముంది. హాస్పిటల్ దగ్గరకయితే రాను అనడంతో పేషెంటుని డిశ్చార్జి చేసి తీసుకెళ్లారు.

★★★

ఇంటి ముందు నీళ్లు జల్లి ముగ్గేసి కోసి కుంకుమద్దిన నిమ్మకాయల పక్కన మట్టి బొమ్మను పెట్టి దాని ముందు అగరొత్తులు వెలిగించి కోటేశ్వర్రావును కూర్చోబెట్టారు.

కనురెప్పల మధ్య రూపాయి బిళ్లంత బొట్టు పెట్టుకున్న భూతవైద్యుడు చేతిలో వేపమండలతో మంత్రాలు చదువుతూ మధ్య మధ్యలో హూంకరిస్తూ కళ్లెగరేస్తూ పళ్లు కొరుకుతూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు.

'మంత్రగాడు పనోడేరా ! విద్యుంది'' చుట్టూ గుసగుసలు. పూజా కార్యక్రమ తతంగమంతా ముగిసేసరికి రాత్రి పదకొండుగంటలు దాటింది. రెడీగా వున్న కోడి మెడ తెగిముక్కలై కూరసట్టిలోకి పోయి...పొయ్యి మీద ఉడుకుతోంది.

ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసినవాళ్లంతా భోజనాలు చేసి పొమ్మనేసరికి మందుసేవనానికి సిద్ధమయ్యారు. ఖర్చు కోటేశ్వర్రావుదే ననుకోండి.

'మనిషి నలతగానే వున్నాడు. ఒంగోలు పెద్దాసుపత్రికన్నా పోయి చూపించ కూడదంట్రా'' పొరుగింటి పోలయ్య కోటేశ్వర్రావును చూసి కొడుక్కి సలహా ఇచ్చాడు.

''యిళ్లు యిాడీడనే చూయిస్తుండారు గానీ గట్టిగా పట్టించుకుంటే ఇన్నిరోజులు తగ్గకుండా ఎందుకుంటాది''మరొకాయన చురక

ఈ సూటిపోటీ మాటలు వినలేక ఎక్కడన్నా అప్పుదొరుకుతుందేమోనని పెద్దకొడుకు ఊరిమీద పడ్డాడు. సాయంత్రానికి ఆర్రూపాయల వడ్డీకి మూడువేలు దొరికితే అవి చేతపట్టుకొని ఒంగోలుకు పోయారు.

హాస్పిటల్లో చేర్చి వారమయినా వ్యాధి ఒక కొలిక్కిరాలేదు. రక్త పరీక్షలు, టీవీ పరీక్ష(స్కానింగ్), గొట్టం బల్బు పరీక్ష(గ్యాస్ట్రోస్కోపీ) అవసరమనుకున్నపుడల్లా ఏదో ఒక పరీక్ష చేస్తున్నారు... మందులు రాస్తున్నారు. ఫలితం మాత్రం కనిపించడం లేదు. పేషెంటు ఒకసారి చెప్పింది మరోసారి చెప్పకుండా ఒకసారి తగ్గిందంటాడు. అంతలోనే తగ్గనేలేదంటాడు.

డాక్టరుగోర్ని అడిగితే 'నో ప్రాబ్లం, టెస్ట్‌లన్నీ నార్మల్‌గానే వున్నాయి. మీరూ చూస్తున్నారుగా... ఒకసారి తగ్గిందంటాడు. మరోసారి తగ్గలేదంటున్నాడు. ఓ.కె. చూద్దాం'' అని వెళుతున్నాడు. భారం పెరుగుతుందే గానీ రోగం కుదరడం లేదు.

''ఏందెబ్బా! ఏం శాద్దాం..డాటేరేమో పర్వాలేదంటుండాడేగానీ బాధ తగ్గపోతుండ్యా. తెచ్చిన డబ్బులేమో పరిచ్చలకే సరిపాయ. ఈడ మా పీకుడుగా వుంది. మనబోటోళ్లం తట్టుకోలేమబ్బా ! ఏమంతు బట్టడం లేదే... ఎట్ట చేద్దాంరా.... ఇంకేడకన్నా తీసుకెల్దామా యేంది?''జేబులో బీడీ తీసుకొని అగ్గిపెట్టెకోసం వెతుక్కుంటూ అడిగాడు కోటేశ్వర్రావు తమ్ముడు.

''మీ ఇష్టం బాబాయి నాకేం తెలుసు''

''డబ్బులేమాత్రముండాయిరా ! బిల్లు కట్టేసి మనూరు తీస్కెళ్లి గామం మీద డబ్బులు కాసిన్ని అడిగి సింగరాయకొండ పోదాం. తిండీ తిప్పలు..మంచి చెడ్డకీ పాకల్లో ఎట్టాగూ అమ్మాయోళ్లుండారు చూసుకుంటారు. డాటేరుతో మాటాడి ఎంతాయిందో బిల్లు కట్టేయండి!'' ఆమోదంగా అందరూ తలాడించారు.

డిశ్చార్జి బిల్లు కట్టాలంటే డబ్బుల్లేవు దాని మాట ఎవరూ పట్టించుకోకుండా మొఖం చాటేస్తున్నారు.

తిరుపతమ్మ చెంగు చాటున మొఖం దాటి కన్నీళ్లు పెట్టుకుంటుంది. కష్టాల్లో ఆదుకుంటారనుకున్న బంధువులు ఫైకం సంగతిరాగానే నోరు తెరవడం లేదు. చెయ్యి కదపడం లేదు.

చేతులు నలుపుకుంటూ తల్లి ముందు నిలబడి ''ఏం మా..... ఎట చేద్దాం'' అన్నాడు.

కన్నీళ్లు తుడుచుకొని గుండె నిబ్బరం చేసుకుంది. చెవిలో కమ్మలు ముక్కు బేసర తీసి కొడుకు చేతికిస్తూ ''బాబాయిని తీస్కెళ్లు! యాడల్లా ఈ మునిముట్టు పెట్టి (కుదువకు) డబ్బులు తీసీమను. బిల్లుకట్టేసి తీసకపోదాం'' అంటూ ముక్కు చీదుకుని భర్త దగ్గరకు చేరింది.

ఒంగోలు నుంచి వచ్చిన ఆరాత్రే గ్రామ కాపు దగ్గరకు పోయి పరిస్థితి చెప్పుకున్నారు. కాపు సమ్మిడిని పంపించి పెద్దలను సమావేశపరిచాడు. గ్రామం మీద డబ్బులు ఐదువేలు సాయం చేసేందుకు గ్రామ కమిటీ అంగీకరించింది.

ఆ డబ్బుతో సింగరాయకొండ డాక్టరు శివరామిరెడ్డి హాస్పిటల్‌లో చేరారు. డాక్టరుగారు రోగిని పరీక్ష చేసి పాత రికార్డులు పరిశీలించాడు.

కోటేశ్వర్రావు 'పిల్లలు గలోన్ని నువ్వే ఎట్టయినా గట్టెక్కించాల''ని ప్రాధేయపడ్డాడు.

డాక్టరు గారు నవ్వుతూ భుజం తట్టి ఎగాదిగా చూశాడు. ''తగ్గిపోతుంది. ఏం పర్వాలేదు. ఊరకే గిలిపెట్టుకోవద్దు. ఆటలమ్మా కాస్త ఎక్కువగా పోయడం వలన ఆ చురుకులు, మంటలు వచ్చాయి. కడుపులో పేగులు కూడా పొక్కినట్టుండాయి. ఇవేవి పెద్ద సీరియస్ విషయాలు కాదులే భయపడమాక. మందులు ఇంటికిపోయి వాడుకుంటారా? ఆస్పత్రిలో నాలుగురోజులుండి పోతారా''

నాలుగురోజులుండి పోతామనడంతో డాక్టరు గారు కాంపౌండరును పిలిచి రూములో చేర్చమని చెప్పి మందుల చీటి చేతిలో పెట్టాడు.

ఆస్పత్రిలో వుండగా చూడ్డానికొచ్చిన చుట్టాలు మాటల సందర్భంలో మరో గిలి పెట్టారు. ''ఇందంతా అక్కదేవతల పనబ్బా! అయ్యింటేనే ఆరలు... ఎంత తిన్నా వంటపట్టదు.... ఏనుగులాంటి మడిసిని కూడా పీల్చి పిప్పిచేస్తాది. ఆ నర్సింలు అట్టాగదా ఎండుకంకి లాగయిపోయింది. ఓ మాలి సోదికెళ్లిరాండెబ్బా'' అనుమానపు అంబోతుని ఉసిగొలిపి వెళ్లిపోయారు.

''అదిరా సంగతి! నాకు బాగులేని కాడ్నించి అనుమానమే ! ఆయాళ ఆడన్నాడు గుర్తుందా... నా కాడ్నించి చెరువులు లాక్కుంటే మీ గతేమవుతుందో చూసుకోండన్నాడు. అన్నంత పని చేశాడ్రా! ఇన్ని చేస్తున్నా తగ్గలేదంటే నా కప్పుడే అనుమానమొచ్చింది. ఆ నా కొడుకు అంతు చూడందే వదలను. రే పెద్దోడా ! పోయి బాబాయోల్లను పిల్చకరా... ఈయాళ ఆడెవ్వారం తేలిపోవాల...పో...''

''సాకలాయిన చెప్పింది కూడా తీసేయాల్సిన ఇసయం కాదెబ్బా! నా మటుకు నాకు ఓ మాలి సోదికెళితేనే మంచిదనిపిస్తుంది'' కోటేశ్వర్రావు తమ్ముడి ప్రతిపాదనకు మరో ఇద్దరు ఆమోదముద్ర వేయడంతో మిగతా వాళ్లు ఏకగ్రీవంగా చేతులెత్తారు.

తిరుపతమ్మ, కోటేశ్వర్రావు పిల్లలు నిస్సహాయంగా తలలాడిస్తూ గంగిరెద్దుల్లా వెంటబడిపోవడం మినహా మరోదారి కనిపించడం లేదు.

సోదికెళితే రంగం పెట్టించారు. అందులో అక్కదేవతలు రావడం(సోదిలో ఎవరు కూర్చున్నా అక్కదేవతలు రావడం సహజ విషయం!!)

దాన్ని శాంతి చేయించడానికి మంత్రగాడి మర్యాదలు కోడీ, మందూ, పొందూ, మామూలుగా జరిగిపోయాయి. ఎప్పటిలాగే ఖర్చు కోటేశ్వర్రావుదే.

ఇంట్లో బత్తెపు గింజలు నిండుకున్నాయి. సాకుడు కోళ్లు సట్లో ఉడికాయి. పందెపుకోళ్లు అమ్ముడుపోయాయి. మనశ్శాంతి దూరమయ్యింది. పనీ పాటు కరువయ్యింది. అప్పులోళ్ల గుంజాటన మొదలయ్యింది.

కోటేశ్వర్రావు బైరాగిలా గడ్డం పెంచాడు. శరీరం చిక్కి శల్యమైంది. అడుగు తీసి అడుగెయ్యాలంటే ఆలోచిస్తున్నాడు. మొఖమంతా మచ్చలతో పెరిగిన వెంట్రుకలతో వికృత రూపం సంతరించుకున్నది. ఎక్కడ కూర్చున్నవాడు అక్కడే కూలబడి పోతున్నాడు. ఏదేదో మాట్లాడుతుంటాడు. ఎవరికీ అర్థం కాదు. ''ఏడెళ్ల కాలం ఎవులు పడతారీయాతన'' అంటూ విసుక్కుంటున్నారు ఇంటోవాళ్లు

తిరపతమ్మ గుల్లమ్ముకొచ్చిన డబ్బులతో గింజలు తీస్తే ఆపూట గడిచిపోతోంది. అంత ముద్ద తినడం కాళ్లీడ్చుకుంటూ పోయి సెంటర్లోనో, తుఫాను షెల్టరు కాడో కాలక్షేపం చేసి ఇంటికి చేరుకోవడం దినచర్యగా మారింది.

★★★

''నానో ! నీకు చాతబడి చేసుంటారనుకుంటన్నార్యా! ఇది ఆ చెంచిరెడ్డి పనే అయ్యుంటాదని యాపమానుకాడ అనుకుంటున్నారు'' గాలి కబురుగా విన్నదాన్ని అబ్బకు అందించాడు.

''అదిరా సంగతి! నాకు బాగులేని కాడ్నించి అనుమానమే ! ఆయాళ ఆడన్నాడు గుర్తుందా... నా కాడ్నించి చెరువులు లాక్కుంటే మీ గతేమవుతుందో చూసుకోండన్నాడు. ఆ...లం...కొడుకు అన్నంత పని చేశాడ్రా! ఇన్ని చేస్తున్నా తగ్గలేదంటే నా కప్పుడే అనుమానమొచ్చింది. ఆ నా కొడుకు అంతు చూడందే వదలను. రే పెద్దోడా ! పోయి బాబాయోల్లను పిల్చకరా... ఈయాళ ఆడెవ్వారం తేలిపోవాల...పో...''

అంత నీరసంలో కూడా కొడుకు చెప్పిన కబురు విని ఎక్కడో అంతరాళంలో దాచుకున్న ఆవేశాన్ని ఒక్కసారిగా వెళ్లగక్కాడు.

అంత ఆవేశంలో కూడా గతం తాలూకు స్మృతులు జీవన చిత్రం కళ్ల ముందు కనబడుతూనే వుంది.

ఒకప్పుడు పల్లెకులంలో పుట్టినా వ్యవసాయాన్ని నమ్ముకుని తన కాళ్లమీద తాను నిలబడి వ్యక్తిత్వమున్న మనిషిలా బ్రతికాడు కోటేశ్వర్రావు. ఏకోజాముకు ముందే మొగుడూ పెళ్లాం చేలోకి పోయి దొరువుల్లో నీళ్ల జోడాలతో మోసుకొచ్చి నీళ్లపోత పోసి రెండు దొరువుల క్రిందున్న ఇసక పొలంలో తైదలు(రాగులు)పండించేవాళ్లు.

తిరపతమ్మ చీరచెంగు మోకాళ్లపైకి ఎగదోపి గోచీ బిగించి ఒక్క లగవున మగాడికేమాత్రం తీసిపోకుండా జోడాలతో నీళ్లపోత పోస్తుంటే జనం విస్తుపోయి చూసేవాళ్లు. మూడోపిల్ల జానకి కడుపులో వున్నప్పుడు నిండు చూలాలువి వద్దన్నా ఇనకుండా పోయి నీళ్లపోతపోసొచ్చి నిక్షేపంగా బిడ్డని కన్నది. ఆ విషయం తెలిసి వూళ్లో జనం ముక్కున వేలేసుకున్నారు.

రాత్రుల్లు అన్నం వండుకున్నా పొద్దునా మద్యాహ్నం తైద సంగటే. తెల్లపాయి కారమో, పచ్చడో, చేపలపులుసో, పుల్లల్లో కలుపుకుని కడుపునిండ సంగటి తిని ఏ చెట్టు క్రిందో గుడ్డ పరుచుకుని పడుకున్నా కంటినిండ ఆదమరిచి నిద్రపోయేవాళ్లు.

సేద్యం చేసుకుంటూ, చేపల వేటా, తిరపతమ్మ గుల్లమాంసం అమ్ముకుంటూ కాపురాన్ని లాక్కొచ్చి ఆడపిల్లల పెళ్లిళ్లు కూడా చేసి పంపారు.

ఆడపిల్లల పెళ్లిళ్లు కూడా అయిపోయాయి. ఇంకేం పర్వాలేదు. మొగోళ్లు ఎట్లో బతికి పోతార్లే అనుకునే సమయంలో వూరికి వుపద్రవమొచ్చినట్లు చెరువులొచ్చి పడ్డాయి. బయటనుంచి వచ్చే వాళ్లతో పోయేవాళ్లతో వూరంతా కలివిడిగా వుంది.

ఎక్కడ నలుగురు కూడినా 'చెరువుల...లక్షలు...చెరువులు...లక్షలు' ఇవే మాటలు. వీధులు దాటి ఇల్లల్లోకి, మెదళ్లల్లోకి చేరి కుమ్మరి పురుగుల్లా తొలవడం మొదలయ్యింది.

జోడాలతో దొరువులోకి దిగిన కోటేశ్వర్రావు జోగుతూ వస్తున్నాడే గాని జోరుగా కదలడం లేదు.

''ఏమయ్యింది నీకు ఎండబడతావుంటే జాము కొక జోడా తెస్తున్నావేంది. ఇట్టయితే మావిటేలకు కూడా చేను తడవదు.''

''నాకు వంట్లో ఏం వుసారు లేదు పో !... మొన్నటి దాకా ఆ లచ్చుగోడు వూసుపోలు కబుర్లు చెబుతూ గాలికి తిరగతావుంటే అంతా ఎకసెకాలాడేవోళ్లు ఈ యాళ ఆడదృష్టం చూడు చేతిలో సెల్లు ఫోనూ, మోటరు సైకిలూ ఆడి కతే మారిపోయింది. నా సిన్నప్పట్నించి నీళ్ల పోత పోస్తానే... వుండాం... ఏంలాభం...యాడేసిన గొంగడి ఆడేనన్నట్లు బెత్తెడు కూడా ముందుకు జలగలా ! థూ...::''

''ఒహోహో ! ఇది బలేగుందే ! ఆడెవుడో సంపాయించుకున్నాడని మన చేనెండ బెట్టుకుంటామాయేంది? ఆడదృష్టం బావుంది కలిసొచ్చింది. ఆడ్ని చూసి యేడిస్తే మనకొస్తాదా యేంది. కష్టపడాల కడుపునిండా తినాలగాని. వూరోల్ల సొమ్ము వూరకే వస్తుంది గదాని తింటే వూపిరాడక చస్తాం ! చాల్లే రా రా!''

''ఏమో పో ! జోడాలు లాగి లాగి రెక్కలు పీకుతుండాయి. నేనింటికి పోతుండా ఆ కొరవ జల్లేసి బిన్నారా'' అంటూ వెళ్లిపోయాడు.

కంకిమీదున్న పైరు కళ్లముందు కనబడుతుంది. వానల్లేక దొరువులో నీళ్లు అడుక్కిపోయాయి. తిరప తమ్మ ఒక్కతే రొప్పుతూ రోస్తూ నీళ్లు పోతచల్లి తడిసి ముద్దయిన బట్టలతో బుంగలు తీసుకుని ఇంటికి చేరింది.

కుటుంబసభ్యులంతా సమావేశమై ఏమయినా సరే చెరువు చేయాలని నిర్ణయానికొచ్చారు. కాలువ దగ్గర తమకో అరెకరా పొలం వుంది. పక్కన ఇంకో ఎకరా పొలం కొని కలుపుకుంటే సరిపోతుంది.

సమయానికి ఇల్లుకట్టి అప్పులపాలయిన పల్నాటి బ్రహ్మయ్య పొలం అమ్ముతున్నాడని తెలిసి దాన్ని బేరం చేశారు. ఈ సంవత్సరం పూర్తి చేయాలనుకున్న కొడుకు పెళ్లి, కొత్త ఇల్లు ఆలోచనను వాయిదా వేసి ఆ డబ్బుతో బ్రహ్మయ్య పొలం కొని వూర్లోకొచ్చిన జెసిబితో ఒక్కరోజులో చెరువు సిద్ధం చేశారు.

సీడూ, పీడూ కంపెనీ వాడే ఇచ్చి తీసిన పంట వాడికేయేసి బాకీ తీర్చేట్టు అగ్రిమెంటు కుదుర్చుకున్నారు. టెక్నీషియన్‌ను కూడా ఏర్పాటు చేశాడు. అతని పర్యవేక్షణలో మేతా, మందులు వాడి జాగ్రత్త చేశారు.

ఆ చెరువుని కంటిని రెప్పలా కాపు కాచి మంచి పంటే తీశారు. దాని కోసం వేళకు తిండి తిప్పలు కూడా మానేసి ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాడు. పంట బాగా వచ్చేసరికి తమ కష్టానికి ఒక దారి కనబడిందని కనులు ఆనందంతో చెమ్మగిల్లాయి

చెరువు తీసేరోజు పొంగలి పెట్టి కోడిని కోసి మనుషుల్ని దింపారు. గట్టు మీద కంపెనీ వాడి లారీ లోడింగ్ కోసం చిన్న చేపల్ని మింగే సొరచేప లాగానోరు (వెనుకడోరు) తెరుచుకుని ఐసుబాక్సులతో రెడీగ వుంది.

పట్టిన రొయ్యలు పట్టినట్లు గ్రేడింగ్ చేసి తూకం వేసి ఐస్‌బాక్సుల్లో ప్యాకింగ్ చేసి లారీకెక్కిస్తున్నారు కూలీలు. కోటేశ్వర్రావుకు సరుకు చూసుకొని మురిసిపోతున్నాడే కానీ తూకం సంగతి పట్టించుకునే స్థితిలో లేదు. తూకంలో తనని ముంచేస్తున్న విషయం గ్రహించే సరికే పని పూర్తయింది.

సరుకుతో లారీ వెళ్లిపోయింది. కష్టపడి పండించిన కోటేశ్వర్రావు కుటుంబం పెట్టుబడి పెట్టిన కంపెనీవాడు మిగిలారు. లెక్కల పుస్తకంతో గుమాస్తా శేషగిరి చిత్ర గుప్తుని మాదిరి స్థిరంగా నిలబడి వున్నాడు.


''ఏం కోటేశ్వర్రావు చానా పొద్దుపోయింది గదా ! లెక్కలు రేపొద్దున చూసుకుందామా?'' ఆవలింత నటిస్తూ వళ్లిరుసుకుంటూ అన్నాడు కంపెనీవాడు.

''ఎంతసేపు లెండి, ఓ గడువు ఆలిస్యమయితే అయింది. లెక్కె మర్నగుంటాది చూసేయన్నా'' ఆత్రుతగా అడిగాడు కోటేశ్వర్రావు కొడుకు.

'సరే' అని గుమస్తా వైపు చూడగానే 'యస్ బాస్' అన్నట్లు గుమస్తా శేషగిరి ముందుకొచ్చి చిట్టాపద్దులు చదవడం ఆరంభించాడు. సీడుకి ఫీడుకీ మందులకీ టెక్నీషియన్‌కు అయిన ఖర్చులు లెక్క కట్టి వచ్చిన సరుకు ఖరీదు జమకట్టి చూస్తే ఇంకా 15వేలు కోటేశ్వర్రావు మిగులు బాకీ తేలాడు.

కోటేశ్వర్రావుకు నోటిలోంచి మాటరాక నోరు తెరుచుకుని నేల మీద కూలబడ్డాడు. ''అంతెందుకయ్యింది. తూకంలో మోసం వుంది. ఇక్కడేం వూరికే రాలేదయ్యా నాలుగు నెల్లనుంచి కూడూ నీళ్లూ లేకుండా యీడబడి చచ్చాం. అంత అన్యాయంగా మాటాడకండి'' ఆడవాళ్లు, కుర్రాళ్లు గయ్యిమని లేచారు.

కూర్చున్న వాడల్లా దిగ్గున లేచి వాదనకు దిగాడు కంపెనీ వాడు. ''మీ కళ్ల ముందే తూకం



వేశాం. దేనికంత ఖర్చయిందో లెక్కలు చెప్పాం. మోసం గీసం అంటారేందీ....కాస్త పద్ధతిగా మాట్లాడండి... ఎవడు మోసం చేశాడు. ఆయాళ అయ్యా, బాబూ అని కాళ్లాయాళ్లా పడ్డారు. ఈ యాళ గడిసిపోయాక గడిసిపోయిన మాటలు మాటాడుతుండారా.... ఏం కోటేశ్వర్రావు నువు మాట్లాడకుండా బెల్లం కొట్టిన రాయినా అలా కూర్చుంటావేంది.... అప్పు ఇచ్చినోన్ని నేనా తప్పుడోన్ని'' గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతున్న కంపెనీ వాడికి సమాధానం చెప్పలేక కోపాన్ని గుండెల్లోనే అణుచుకుని నిమ్మకుండిపోయారు.

ఇప్పటిదాకా అలజడికి కేంద్ర బిందువయిన చెరువు నిశ్శబ్దంగా వుంది.

చెరువు గట్టు మీద ట్యూబులైట్లు రేపటి నుంచి మాకు శెలవులు అన్నట్లు నిలబడున్నాయి. ఆకాశంలో చంద్రుడు మబ్బుల మాటికి పరుగులీస్తున్నాడు.

''మోసం గీసం అంటారేందీ....కాస్త పద్ధతిగా మాట్లాడండి... ఎవడు మోసం చేశాడు. ఆయాళ అయ్యా, బాబూ అని కాళ్లాయాళ్లా పడ్డారు. ఈ యాళ గడిసిపోయాక గడిసిపోయిన మాటలు మాటాడుతుండారా.... ఏం కోటేశ్వర్రావు నువు మాట్లాడకుండా బెల్లం కొట్టిన రాయినా అలా కూర్చుంటావేంది.... అప్పు ఇచ్చినోన్ని నేనా తప్పుడోన్ని.''

పొలి తిరిగిన కోడిపుంజు పొయ్యిమీద వుడుకుతోంది. అన్నం రెడీ అయ్యిందని దూరం నుంచి పిలుపు వచ్చింది. కోటేశ్వర్రావుకి తినబుద్ధికాలేదు. రొయ్యలు పట్టిన కూలోళ్లకి వడ్డించారు.

దిగాలుగా కూర్చున్న కోటేశ్వర్రావు బుజం మీద ప్రశాంత వదనంతో శాంతి దూతలాగా చెయ్యేశాడు కంపెనీవాడు.

బస్మాసుర హస్తంలా అనిపించి పైకి చూశాడు. భగవద్గీత వినిపించే కృష్ణమూర్తి ఫోజులో కంపెనీ వాడు.

''ఏంది కోటేశ్వర్రావు యీ మాత్రం దానికే అంత దిగాలు పడతావేంది. మొదటి పంటకు గాబట్టి ఖర్చులు కాస్త ఎక్కువయినాయి. ప్రతిసారీ ఇంత ఖర్చు ఎందుక వుద్ది. చుట్టుపక్కల ఎవురికయినా ఈ మాత్రం కౌంటు వచ్చిందా? ఇదే మాదిరి ఇంకో పంట వచ్చిందంటే చాలు నీ బాకీ గీకీ మొత్తం క్లోజయి పదిరూపాయిలు చేతిలో పెట్టుకుని తిరుగుతావూ. నీకేం కావాలన్నా ఇమ్మని గుమస్తాకు కూడా చెప్పాను గదా! ఈసారి పంటలో బయటపడిపోతావు పో నీకేందుకు. పద అన్నం తిందాము పొద్దుపోయింది'' అప్పటి దాకా కేకలేసిన కంపెనీవాడు ఆప్యాయంగా పలకరించే సరికి ఐస్అయిపోయి లేచి భోజనానికి పోయాడు.

★★★

పోయిన కాడే వెదుక్కోవాలన్నట్లు...పట్టువదలని విక్రమార్కునిలా మళ్లా మళ్లా చెరువులేస్తున్నారూ...తీస్తున్నారే గానీ ఋణ విముక్తులు మాత్రం కాలేకపోతున్నారు. ఈ మధ్య కాలంలో 'వైరస్' తగిలి కోలుకోలేని దెబ్బకొట్టింది. దాంతో చెరువుల మీద విరక్తి కలిగి'' ఇక పంటేయడం అనవసరం'' అనుకున్నారు.

పక్క చెరువులు చేస్తున్న ఉలిచి చెంచిరెడ్డి చెరువు లీజు కిస్తాడేమో కనుక్కోమని మధ్యవర్తిని కోటేశ్వర్రావు దగ్గరికి పంపించాడు. సంవత్సరానికి ఇరవై వేలు లెక్కన మధ్యవర్తుల సమక్షంలో లీజు అగ్రిమెంటు రాసుకొన్నారు. అడ్వాన్స్ పైకం చేతిలో పడిందో లేదో అప్పులోళ్లు కమ్ముకున్నారు. చివరకు ఉత్తచేతులతో ముఖం నిండా దిగులు కూడగట్టుకుని ఇంటికి చేరాడు కోటేశ్వర్రావు.

శవదహన సంస్కారం జరిగినట్లు ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నులకమంచం మీద ఆకాశం వైపు చూస్తూ పడుకున్నాడు. చెరువులో రొయ్యల్లా ఆకాశంలో నక్షత్రాలు మీకందమన్నట్లు మిణుకుమిణుకు మంటూ వెక్కిరిస్తున్నాయి. వైరస్ సోకిన రొయ్యల్లా కనుగుడ్లు కన్నీటి చెరువులో త్రేలాడుతుంటే నీరు పొంగి పొర్లుతోంది.

చెరువులు చెంచిరెడ్డి చేతికొచ్చినప్పటి నుంచీ అతని అదృష్టమో ఆక్వాకల్చర్ మీదున్న అవగాహన వలనో గానీ ఎంతో కొంత లాభం చూపిస్తున్నాయి. కోటేశ్వర్రావు రోజుకు ఒక్కసారన్నా చెరువుకాడికి ఇంటికి తిరుగుతుంటాడు. మనసులో ఒక విధమైన ఈర్ష్యా, ద్వేషం, దిగులు పెంచుకున్నాడు.

లీజు అగ్రిమెంటు కాలం వరకూ వుగ్గబట్టిన కోటేశ్వర్రావు ఇక ముందు చెరువు లీజుకివ్వనన్నాడు. కనీసం ఇంకో రెండు పంటలకన్నా చెరువు ఇవ్వకుంటే నష్టపోతానన్నాడు చెంచిరెడ్డి.

''మాకు తెలుసులేవయ్యా ! చెరువు మీద లాభం వచ్చిందో, నష్టమొచ్చిందో అదంతా అనవసరం. చెరువు ఇచ్చేది లేదు అంతే''

లాభాలు రుచి చూసిన చెంచిరెడ్డి చెరువు చెయిదాటిపోతున్నందుకు బాధ కలిగి తిట్లు శాపనార్థాలకు దిగాడు. ''నన్ను ముంచి మీరు బాగుపడరు. మీరే గతి పడతారో చూసుకోండి. సర్వనాశనమై పోతారు''

చెంచిరెడ్డి మాటలకు కోపమొచ్చిన కోటేశ్వర్రావు చేయిచేసుకున్నాడు. ఆరోజు చిన్న గొడవతో వ్యవహారం సద్దుమణిగింది.

కోటేశ్వర్రావు కుటుంబం మళ్లా కల్చర్లోకి దిగింది. అప్పటికే ఆక్వాకల్చర్ నష్టాల బాటలో గుర్రంలా పరిగెడుతూ రైతులు వూపిరాడక వుక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫీడ్ కూడా అప్పుదొరకడం లేదు.

''నీ వల్లే అనవసరంగా మళ్లీ దిగాం. అని ఒకరంటే నీ వల్లే ఈ దరిద్రం'' అంటూ ఒకర్నొకరు దెప్పిపొడుస్తున్నారు. కుటుంబంలో కలతలు మొదలై మనశ్శాంతి కరువైంది. ప్రస్తుతానికి చెరువుకు క్రాప్ హాలిడే ప్రకటించారు.

కోటేశ్వర్రావుకి వచ్చిన అనారోగ్యం తాత[illegible]మైనా దీర్ఘకాలిక మనోవేదనకి మూలకారణమైంది. ప్రతిదానికి అతిగా స్పందించడం, అనుమానం, తగాదాలు నిత్యకృత్యమయినాయి.

చెంచిరెడ్డి ప్రస్తావన వచ్చేసరికి జరిగిన సంఘటనల తాలుకు జ్ఞాపకాలు కళ్లముందు కదిలాయి. ఆ రోజన్న మాటల్నే బలంగా పట్టుకుని పగపెంచుకున్నారు.

కోటేశ్వర్రావు చుట్టాలు, పక్కాలూ బిలబిలమంటూ పూనకం వచ్చినట్లు వూగిపోతూ వచ్చేశారు. ''ఏడి! ఎక్కడా నా కొడుకు పదండ్రా'' మూకుమ్మడిగా దాడికి పోయారు.

ఈ హఠాత్పరిణామానికి చెంచిరెడ్డి బిత్తరపోయాడు. వాదోపవాదాలు తీవ్ర రూపంలో జరుగుతున్నాయి.

''ఆ రోజు ఏదో కోపంలో అలా మాట్లాడేనేగాని మీ సంగతి పట్టించుకోలేదు. నాకే పాపం తెలీదు'' మొర పెట్టుకున్నాడు చెంచిరెడ్డి.

''నీ నక్కజిత్తుల యవ్వారం మాకు తెలుసులేరా...దొంగనాకొడక...పస్తీకి పోతే కూడా నువ్వేనని వచ్చింది. నిన్ను వదలమురా!''

''ఎహె !వాడితో ఇంకా మాటలేందిరా ! నా కొడుకుని పడేసి నాలుగు తన్నక?''

ఈ గొడవ మధ్యలో ఒకడు రాయితో చెంచిరెడ్డి నెత్తిన బలంగా కొట్టడంతో తలపగిలి రక్తస్రావమై కింద పడిపోయాడు.

వూరి జనం పోగయ్యారు. ''ఇంతమంది జేరి ఒక్కడ్ని చావకొడుతున్నారు. అతనికేమన్నా అయ్యిందంటే వూరు మొత్తానికి చుట్టుకుంటుంది. పదండి...పదండి''అందర్ని తరిమేశారు.

చెంచిరెడ్డి కొత్తపట్నం పోలీస్ స్టేషన్కొచ్చి కేసు పెట్టాడు. తలకు ఒంగోలు గవర్నమెంటు హాస్పిటల్లో కుట్లు వేశారు. డాక్టరు సర్టిఫికేటు తీసుకొని కేసురాసుకున్నారు.

కేసు రిజిష్టరయ్యింది. పోలీసులు గుండమాల కొచ్చి ఇల్లిల్లు తిరిగి ముద్దాయిల్ని పట్టుకుపోయి స్టేషన్ సెల్లో పెట్టారు.

కోర్టుకి హాజరు పరచడానికి రిమాండు విధించారు. బెయిలు తెచ్చుకోవడానికి వారం పది రోజులు పట్టింది. లాయరు ఫీజు, బెయిలు ఖర్చులు రాకపోకల ఖర్చులు తడిసిమోపడయ్యింది.

బెయిలు తీసుకొని ఇంటికొచ్చాక వూళ్లో తలా ఒక మాటన్నారు. అన్నె పున్నెం తెలికుండా అన్యాయంగా చెంచిరెడ్డిపై దాడి చేశారన్నారు.

వారాలు నెలలూ గడుస్తున్నా వాయిదాలకు తిరగడమే కానీ కేసు కొలిక్కిరావడం లేదు.

వాయిదాలు, కోర్టు ఖర్చులు అప్పులోళ్ల తిప్పలు తట్టుకోలేక రొయ్యల చెరువు అమ్మేశాడు. చెరువు మోజు తీరింది. చెంప దెబ్బ మిగిలింది.

శూన్యం నిండిన కళ్లతో ఆశచావని చూపులతో బక్కచిక్కిన దేహంతో జీవశ్చవంలా కోర్టు బోనులో నిలబడ్డ కోటేశ్వర్రావు ఏదో పోగొట్టుకున్న దాని కోసం వెదుకుతున్నట్లుగా దిక్కులు చూస్తున్నాడు. ★